

సీపీఎస్‌పై ముగిసిన ఆడిట్

ఎచ్చెర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యూనివర్సిటీలో సీపీఎస్‌పై గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఆడిట్ శనివారంతో ముగిసింది. ఎం.రమణ మూర్తి, అర్పిత్‌జైన్ సభ్యులు.. ఆడిట్‌లో భాగంగా అకడమిక్ పనులపై సమాచారాన్ని సేకరించారు. నేషనల్ పెన్షన్ స్కీమ్‌లో భాగంగా పెర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నెంబరు(ప్రాన్)కు సంబంధించి సమాచారంతో పాటు జమ చేసిన నిధుల గురించి తెలుసుకున్నారు. ఆడిట్ సభ్యుల అభ్యంతరాలను, సూచనలను సరిదిద్దుతూ గతంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి ఈ ఏడాది 31 తేదీ నాటికి పూర్తిస్థాయిలో ప్రాన్‌కు సంబంధించిన వివరాలు పొందుపర్చారు.

- వైసీపీ హయాంలో గంపగుత్తుగా ధ్రువపత్రాలు
- అధికశాతం సకలాంగులే దివ్యాంగులుగా..
- కూటమి ప్రభుత్వం వచ్చాక బయటపడిన బాగోతం
- అదే వైద్యుడు.. ఇప్పుడు రిమ్స్‌లో 'సదరం' వైద్యపరీక్షలు
- అర్హులు పడిగాపులు.. అనర్హులకు అండదండలు
- తొలిగా ఆమదాలవలసలో వెలుగులోకి వ్యవహారం
- ఆ తర్వాత నరసన్నపేట, ఎచ్చెర్లలో బయటకు..
- ఆ వైద్యుడు ఇప్పుడూ అదేతంతు.. దళారులతో కుమ్మక్కు
- ఏడాది పింఛన్ మొత్తం ఒకేసారి ఇస్తే సర్టిఫికెట్ రెడీ


ఓ డాక్టర్ గారి నకిలీలలు



అనగనగనగా
ఓ ప్రభుత్వ వైద్యుడు. వైసీపీ హయాంలో చెలరేగిపోయాడు. నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చి జేబులు నింపుకున్నాడు. డబ్బులిస్తే సకలాంగులనూ దివ్యాంగులను చేసేశాడు. ఎట్టకేలకు ఆయనగారి యవ్వారం బయటపడింది. దీంతో ఉన్నతాధికారులు నకిలీ సర్టిఫికెట్లను రద్దు చేశారు. ఇప్పుడు ఆయనే రిమ్స్ 'సదరం'లో కీలక విధులు నిర్వహిస్తున్నారు. ఆయనగారి తరపున దళారులు రంగంలోకి దిగారు. మీకు ఏ వైకల్యం లేకున్నా.. ఏడాది పింఛన్ మొత్తం ఇస్తే చాలు.. సర్టిఫికెట్ ఇప్పిస్తామంటూ బేరాలు పెడుతున్నారు. ఇంతజరుగుతున్నా కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు నోరుమెదపక పోవడం గమనార్హం.

● సరుబుజ్జిలి మండలం విజయరామపురం పంచాయతీ కూనజమ్మన్నపేటలో ఇటీవల ఎలాంటి అంగవైకల్యం లేకున్నా.. 13 మంది దివ్యాంగ పింఛన్లు పొందారు. వారు గతంలోనూ.. ప్రస్తుతం రిమ్స్‌లో.. సదరంలో పరీక్షలు నిర్వహించే ఆర్థోపెడీషియన్ ద్వారా సర్టిఫికెట్‌లు పొందారు. ఇందుకు ఒక్కొక్కరి నుంచి రూ.30వేలు వసూలు చేసి ఇటు దళారీలు.. వైద్యుడు పంచుకున్నారని కీలక ప్రజాప్రతినిధికి ఫిర్యాదు అందింది. దీనిపై విచారణకు ఆదేశించారు. రిమ్స్‌లో గురువారం 13 మందికి వైద్యపరీక్షలు చేశారు. వారంతా అనర్హులని తేలింది. ఆ సర్టిఫికెట్లను రద్దు చేశారు. అయితే అందులో ఒక మహిళను అర్హులుగా గుర్తించాలని.. మరో ప్రజాప్రతినిధి సిపార్సు చేశారు. దీంతో చేసేది లేక ఆమెను మాత్రమే అర్హురాలని తేల్చి.. మిగిలిన 12మంది అనర్హులేనని ఉన్నతాధికారులు తేల్చారు. ప్రస్తుతం సరుబుజ్జిలి మండలంలోని ఒక్క పంచాయతీలోనే ఈ తంతు బయటపడింది.

● నరసన్నపేట, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో నకిలీ పింఛన్‌దారుల జాబితా కూడా ఉన్నతాధికారులకు చేరింది. దీనిపైనా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సర్టిఫికేట్‌ల విచారణ జరుగుతోంది. ఇంతలా అనర్హులు పుట్టుకురావడానికి కారణమైన... ఆర్థోపెడీషియన్‌కు ఇప్పుడు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోనే కీలక విధులు అప్పగించడం.. ఆపై సదరంలోనూ ఆయనే కొనసాగడం పలు అనుమానాలకు తావిస్తోంది.



శ్రీకాకుళం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం.. వృద్ధులకు, దివ్యాంగులకు సామాజిక పింఛన్‌ను పెంచింది. దీనిపై కన్నేసిన కొంతమంది.. దివ్యాంగం ఉన్నట్టు నిర్ధారించే వైద్యుల 'సదరం'లో ధ్రువీకరణ పత్రాలు పొంది.. అక్రమంగా పింఛన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలా తప్పుడు ధ్రువపత్రాలతో చాలామంది అనర్హులు దివ్యాంగ పింఛన్లు పొందారు. అప్పట్లో ఓ అవినీతి వైద్యుడి ఆశీస్సులతో సదరంలో దివ్యాంగులుగా ధ్రువపత్రాలు జారీచేయించుకుని.. లబ్ధి పొందారు. నిన్న మొన్నటి వరకు నరసన్నపేట, రణస్థలం ఆస్పత్రుల్లో విధులు చేపట్టి.. పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు మూటకట్టుకున్న ఆ వైద్యుడిప్పుడు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్ - జీజీహెచ్)లో ఏకంగా సదరంలో కీలక విధులు నిర్వహిస్తుండటం చర్చనీయాంశమైంది. అర్హులకు ఇబ్బంది పెడుతూ.. దళారీలు తెచ్చిన అభ్యర్థుల జాబితాకు ఎంచక్కా అనుమతిస్తూ... తాను అప్పుడూ ఇప్పుడూ అవినీతికే పాల్పడుతూనే ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సర్టిఫికెట్ కోసం.. ఏడాది పింఛన్ ఇవ్వాలంట..

అక్రమాలకు అండగా వైద్యుడు కలిసి రావడంతో పలుచోట్ల దళారీలు రంగంలోకి దిగారు. అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేలు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేల పేర్లతో చెలామణి అవుతూనే ఉన్నారు. దివ్యాంగులకు పింఛన్ ఎక్కువగా వస్తుందని.. తమకు డబ్బులిస్తే సదరంలో అనర్హులకు సైతం సర్టిఫికెట్ చేయించేస్తామని చెబుతున్నారు. పింఛన్ మంజూరు కోసం (మిగతా 6వ పేజీలో...)

● వైసీపీ హయాంలో గంపగుత్తుగా...

ప్రస్తుతం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న ఆర్థోపెడీషియన్.. వైసీపీ హయాంలో నరసన్నపేట, రణస్థలం ఆస్పత్రుల్లో విధులు నిర్వహించారు. అడ్డగోలుగా సకలాంగులకు సైతం దివ్యాంగత్వం ఉన్నట్టు 'సదరం'లో గంపగుత్తగా ధ్రువపత్రాలు జారీచేసే విషయంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన నరసన్నపేట నియోజకవర్గంలో భారీగా నకిలీ దివ్యాంగులు పింఛన్ పొందేలా అక్రమాలకు పాల్పడ్డారు. దళారీలను ఏర్పాటు చేసుకుని.. వారి ద్వారా తనకు వచ్చిన జాబితాను పరిశీలించేవారు. పింఛన్ మంజూరుకు అవసరమైన వికలాంగత్వం శాతాన్ని వేసి.. సర్టిపికెట్‌లను సిపార్సు చేసేవారు. ఇటువంటివి ఆమదాలవలస నియోజకవర్గంలోనూ చోటుచేసుకున్నాయి. ఇప్పుడు ఆమదాలవలస నియోజకవర్గం సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు మండలాల్లో నకిలీల బాగోతం బట్టబయలైంది. అప్పట్లో ఆర్థోపిడీషియన్ మంజూరు చేసిన నకిలీ దివ్యాంగులకు సర్టిఫికెట్‌లపై ఉన్నతాధికారులకు గుట్టుగా ఫిర్యాదు అందింది. దీంతో అసలు బండారం బయటపడింది.



నకిలీ దివ్యాంగ ధ్రువపత్రాలపై అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ రాజు

నకిలీ దివ్యాంగుడికి.. వంద శాతం వైకల్యమా?

- రిమ్స్‌లో వైద్యాధికారుల తీరుపై ఫిర్యాదు చేస్తాం
- ఆమదాలవలస మండల సమావేశంలో సర్పంచ్ ఆవేదన

7 లో

ఆమదాలవలస, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):

ఆ వ్యక్తి నకిలీ దివ్యాంగుడు. వైసీపీ హయాంలో 40శాతం వైకల్యం ఉన్నట్టు 'సదరం' ధ్రువపత్రం ద్వారా దివ్యాంగ పింఛన్ పొందాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. వారిద్దరూ వితంతువు పింఛన్‌లు పొందుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో.. ఆ నకిలీ దివ్యాంగుడ్ని పునః విచారణ కోసం రిమ్స్‌లో సదరం విభాగానికి పంపారు. అక్కడ లంచాలకు అలవాటు పడిన ఓ వైద్యాధికారి.. ఆ నకిలీ దివ్యాంగుడికి ఏకంగా 100 శాతం వైకల్యం ఉన్నట్టు నిర్ధారించి.. ధ్రువపత్రం ఇచ్చేశారు. ఇదెక్కడి అన్యాయం. వైసీపీ పాలనలో లబ్ధి పొందిన నకిలీలను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతున్న వేళ.. రిమ్స్‌లో వైద్యాధికారుల తీరు దారుణంగా ఉంది. దీనిపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

- ఇదీ ఆమదాలవలసలోని సర్వసభ్య సమావేశంలో కనుగులవలస సర్పంచ్ నూకరాజు ఆవేదన

టీడీపీకి కార్యకర్తలే బలం

- పార్టీ సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానం సాధించాలి
- కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

అరసవల్లి/ టెక్కలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ.. క్రమశిక్షణ గల పార్టీ. 42ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో టీడీపీకి కార్యకర్తలే పునాదులు. పార్టీకి వారే బలం' అని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం శ్రీకాకుళంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. అలాగే టెక్కలిలో మంత్రి అచ్చెన్నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి.. తొలి సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ ఊరూవాడా పండగ వాతావరణంలో జరగాలని వారు సూచించారు. రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలని పిలుపునిచ్చారు. సభ్యుల సంక్షేమ కోసం అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

7 లో



టెక్కలిలో సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జూన్ నాటికి నదుల అనుసంధానం

- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాగావళి, వంశధార నదుల అనుసంధానం పనులు వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 'నదుల అనుసంధానానికి సంబంధించి ఇప్పటికే రూ.106 కోట్లు ఖర్చు చేసి 75 శాతం పనులు పూర్తి చేశాం. కొద్దిపాటి భూసేకరణ సమస్యలను పరిష్కరించి గడువులోగా పనులు పూర్తిచేయాలి' అని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రాజెక్టుల స్థితిగతులపై చర్చించారు. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ఒడిశాతో నేరడి వివాదాన్ని, సింగిడి, పారాపురం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. హిరమండలం ప్రధాన రిజర్వాయర్ పనులు 95శాతం పూర్తయ్యాయని, ప్యాకేజీ 87, 88 పనులు, కాలువల పరిస్థితిని (మిగతా 6వ పేజీలో..)

జానపద కళా సేవలో..

- కళ, సంస్కృతీ రూపాల పరిరక్షణలో విశ్రాంత అధ్యాపకుడు
- జానపద రచనలతో ప్రజాచైతన్యం
- ఇదీ బద్రి కూర్మారావు ప్రస్థానం

6 లో

నిజంగా.. 'ఆదర్శ' పాఠశాలే!

- కొండములగాం స్కూలుకు ఉత్తమ గుర్తింపు
- పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత
- ఒకేసారి 24 మంది ట్రిపుల్ ఐటీకి..

6 లో

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'ఎక్కడా బాణసంచా (మిగతా 6వ పేజీలో..)



బుల్లెట్ ఇలా లోడ్ చేయాలి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీసుల ఆయుధాల వినియోగంపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి.. విద్యార్థులకు అవగాహన కల్పించారు. అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా శనివారం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన ఓపెన్‌హౌస్‌లో ఎస్పీ పాల్గొన్నారు. పోలీసుల ఆయుధాలు వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. ఆయుధాల పనితీరును వివరించారు. తుపాకీలో బుల్లెట్‌లు ఎలా లోడ్ చేయాలో చూపించారు. ప్రతీ విద్యార్థి యూనిఫాం లేని పోలీసేనని, సమాజంపై బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు.

స్టాంపులు కావాలా.. నాయనా!

- రెట్టింపు ధరకు విక్రయిస్తున్న వెండర్లు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొరత
- బయటకు తరలింపుపై ఎన్నో అనుమానాలు

● సారవకోట మండలానికి చెందిన ఒక ఆసామి నాన్-జ్యూడిషియల్ స్టాంపు కొనుగోలు కోసం నరసన్నపేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. కౌంటర్‌లో ఉన్న ఉద్యోగి... స్టాక్ లేదని తెలిపారు. దీంతో బయట ఒక వెండర్ వద్ద కొనుగోలు చేయగా.. రూ.20 స్టాంపునకు సంబంధించి రూ.40 తీసుకున్నారు. రెట్టింపు ధర ఏమిటని ఆ ఆసామి ప్రశ్నించగా.. 'ఇష్టం ఉంటే తీసుకోండి.. లేదంటే.. వెళ్లండి' అని ఆ వెండర్ సమాధానం ఇచ్చారు. దీంతో తప్పని పరిస్థితిలో ఆ స్టాంపును కొనుగోలు చేశారు.

● పోలాకి మండలానికి చెందిన ఒక రైతు తన భూమిని విక్రయించేందుకుగానూ.. నాన్-జ్యూడిషియల్ స్టాంపు కోసం నరసన్నపేటలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సిబ్బంది స్టాంపులు లేవన్నారు. దీంతో ఒక స్టాంపు రైటర్ దగ్గరకు వెళ్లగా.. క్రయవిక్రయాల డాక్యుమెంట్లుకు సరిపడే స్టాంపులు ఇచ్చారు. రూ.150 అదనంగా తీసుకున్నారు.

నరసన్నపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత వేధిస్తోంది. జిల్లాలోని శ్రీకాకుళం, నరసన్నపేట, కోటబొమ్మాళి, టెక్కలి, పలాస, సోంపేట, పాతపట్నం, మందస, ఆమదాలవలస, తదితర ప్రాంతాల్లో 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిలో ఎక్కడా స్టాంపులు లేకపోవడంతో క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. బయట వెండర్స్ మాత్రం ఇష్టానుసారంగా స్టాంపులను అధిక ధరకు విక్రయిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాన్ నాన్ జ్యూడిషియల్ స్టాంపుల స్థానంలో 'ఈ-స్టాంపు'లను వినియోగించారు. ఈ-స్టాంపుల విక్రయాల్లో వెండర్స్ ఒక్కో దానిపై 50శాతం నుంచి 70శాతం వరకు అదనంగా వసూళ్లు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు రద్దు చేసింది. పూర్వం భారత ప్రభుత్వం ముద్రించే నాన్-జ్యూడిషియల్ స్టాంపులను మళ్లీ వినియోగంలోకి తెచ్చింది. దీంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న పాత స్టాంపులను కొంతమంది వెండర్స్ బల్క్‌గా కొనుగోలు చేశారు. ఈ క్రమంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత ఏర్పడింది. ఇదే అదనుగా స్టాంపు వెండర్స్ రెట్టింపు ధరలకు వాటిని విక్రయిస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపులు లేకపోయినా.. వెండర్స్ వద్ద లభ్యం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



నరసన్నపేట ఒక వెండర్ వద్ద బల్క్‌లో రూ.20 స్టాంపులు



నరసన్నపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

వెండర్స్‌దే హవా..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపు వెండర్స్ హవా కొనసాగుతోంది. క్రయవిక్రయాలు చేసిన వారు.. కేవలం సంతకాలకే పరిమితం కాగా.. మిగతా అంతా.. బయట.. లోపల వెండర్స్ హవా కొనసాగిస్తున్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజును చలానా తీస్తారు. ఈ చలనాతో పాటు డాక్యుమెంట్ టైపింగ్, స్టాంపులు ఫీజు, లోపల అధికారికి, సిబ్బందికి ఇవ్వాల్సిన మామూళ్ల అంటూ భారీ మొత్తాల్లో వసూళ్ల చేస్తున్నారు. ప్రభుత్వ చలానా రూ.12వేలు అయితే.. అన్నీ ఖర్చులకు కలిపి.. రూ.25 వేల వరకు కొంతమంది వెండర్స్ వసూళ్ల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సొంతంగా వెళ్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోలేని పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి స్టాంపులు నిర్ణీత ధరకు విక్రయించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

రెండురోజుల్లో వస్తాయి..

జిల్లా కార్యాలయానికి నాన్- జ్యూడిషియల్ స్టాంపులు రెండు రోజుల్లో వస్తాయి. అక్కడ నుంచి వాటిని తెచ్చి విక్రయిస్తాం. ప్రస్తుతం రూ.10, రూ.20 స్టాంపులు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యకారణంగా విక్రయాలు చేయలేకపోతున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు చేపడుతున్నాం.

- బసవేశ్వరరావు, సబ్‌రిజిస్ట్రార్, నరసన్న పేట

జానపద కళా సేవలో..


పల్లెల్లో ఒకప్పుడు వినియోగించిన వస్తువుల సేకరణ..

● కళ, సంస్కృతీ రూపాల పరిరక్షణలో విశ్రాంత అధ్యాపకుడు ● జానపద రచనలతో ప్రజాచైతన్యం ● ఇదీ బద్రి కూర్మారావు ప్రస్థానం

పలాస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

ఇటు అంతరించిపోయే దశలో ఉన్న ఉత్తరాంధ్ర కళలను పరిరక్షించడం... అటు కళాకారులను గుర్తించి... వారిని ప్రపంచానికి పరిచయం చేయడం... మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటి చెప్పే వస్తువులు సేకరించి... బాహ్య ప్రపంచానికి చూపించడం... ఆ కళలను పుస్తక రూపంలో తీసుకొచ్చి సామాజిక చైతన్యం తీసుకురావడం.. ఈ బాధ్యతలన్నిటినీ తన భుజాన వేసుకున్నారు బద్రి కూర్మారావు మాస్టారు. పలాస మండలం రంగోయి గ్రామంలో బద్రి లక్ష్మమ్మ, అప్పన్నలకు జన్మించిన ఆయన ఎంఏ అర్థశాస్త్రం చదివి సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో పీహెచ్‌డీ పట్టా పుచ్చుకున్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసి... ఆ తరువాత అధ్యాపకుడిగా పదవీ విరమణ చేశారు.

కళలను వెలుగులోకి తేవాలని...

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నో జానపద కళలు అంతరించే దశలో ఉన్నాయి. వాటిని వెలుగులోకి తీసుకురావడంతో పాటు పరిరక్షించే బాధ్యతను కూర్మారావు తీసుకున్నారు. పల్లె, జానపదులు పాడుకునే పాటలు, ఆటలు, నృత్యాలు, సామెతలు, కళలను రక్షించుకునే బాధ్యత అందరిపై ఉంది. అలసట నుంచి ఉపశమనం పొందడానికి... కష్టాన్ని మరచిపోవడానికి ఈ కళలు దోహదం చేస్తాయి. తోలుబొమ్మలాట, తప్పెటగుళ్లు, జముకులపాట, ఒగ్గుకథ, బుర్రకథ, హరికథ, దాసరి పాటలు, జంగాల కథలు, యక్షగానం, డప్పు, కొమ్ము నృత్యం, బుట్టబొమ్మలు, మేమేగుర్రం, ఎరుకల పాటలు, రుంఝావాద్యంతో పాటు అనేక జానపద పాటలు ఇప్పటి తరానికి అంతగా తెలియవు. కూర్మారావు రచనలతో అవి ఈ తరానికి చేరువవుతున్నాయి.


కూర్మారావు నిర్వహిస్తున్న గ్రంథాలయం

'చిన్నచిన్న గుంటలు - తూటికూర కెళ్లగా తుంబముళ్లు గుచ్చగా - బావతోని చెప్పగా బండిరిసు కట్టగా - ఏ ఊరి బళ్లు కొల్లాం బళ్లు - కొల్లాం బళ్లకు కొదాలు లేవు - మాఊరు బళ్లకు మనుషులు లేరు'...

అంటూ తూటికూర పాట నుంచి ధాన్యం పాట, కాకి పాట, గుడుగుడు గుంచం...ఇలా చిన్ననాటి జానపద జీవితాన్ని ఆవిష్కరించే వెయ్యికి పైగా పాటలు, వందల కొద్దీ జానపద గేయాలు, పదుల సంఖ్యలో ఉత్తరాంధ్ర జానపద కళలను కాపాడే ప్రయత్నం చేసిన వ్యక్తి కూర్మారావు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మొత్తం జానపద కళాకారులను గుర్తించి... వారి జీవన చిత్రాలను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. జానపద గేయాల ద్వారా మొత్తం మరుగున పడిపోతున్న గేయాలన్నీ ఒకేచోట ఆవిష్కరించారు. పిల్లల్లో నైపుణ్యం పెంచడానికి వారి నుంచే నేరుగా కథలు సేకరించి... 'పిల్లలు రాసిన కళింగ సీమ జానపద కళలు' పుస్తకాన్ని తీసుకొచ్చారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర చరిత్రను దేశ రాజధాని నుంచి ఖండాంతరాలకు పరిచయం చేశారు.


జానపద వాయిద్య పరికరాలు డప్పు, కంజీర, జముకు..

ఉత్తరాంధ్ర జానపద కళలు, కళింగాంధ్ర జానపద గేయాలు, పిల్లలు రాసిన కళింగసీమ జానపద కళలు, ఉద్దానం కిడ్నీ విషాదాలు వంటివి ఆయన కలం నుంచి వెలువడినవే. కిడ్నీ వ్యాధులపై ఆయన రచనలు ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని రగిలించాయి.

కళా సేద్యం..

పలాస మండలం రంగోయి గ్రామంలో 2004లో కూర్మారావు కళా సేద్యానికి శ్రీకారం చుట్టారు. గిడుగు రామ్మూర్తి తెలుగుభాష-బద్రి అప్పన్న స్మారక జానపద కళాపీఠాన్ని స్థాపించారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కళాకారులతో ప్రదర్శలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలకు జానపద కళలను పరిచయం చేయడం... నగదు ప్రోత్సాహం అందించి... కళాకారులను ఆదుకోవడాన్ని ప్రారంభించారు. ఏటా జనవరి 11న ఈ కార్యక్రమం నిర్వహిస్తూ కళాకారుల్లో సంక్రాంతిని నింపుతున్నారు. గత ఏడాది ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర గొమాంగోతో డప్పు వాయిద్య ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

జానపద సంపద..

బద్రి కూర్మారావు ప్రస్తుతం విజయనగరంలో నివాసం ఉంటున్నారు. ఆయన నివాసం ఓ జానపద గ్రంథాలయంగా చెప్పవచ్చు. జానపద గ్రంథాలతో పాటు ఆనాటి పల్లెల్లో వినియోగించే వస్తువులు ప్రదర్శనకు పెట్టారు. దీంతో పాటుగా జానపద విద్యాలయం, బాలల గ్రంథాలయం పేరుతో విజ్ఞాన కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

పరిశోధన గ్రంథాలుగా గుర్తించాయి..

నా జానపద రచనలు, బాలల జానపద రచనలు అనేక విశ్వవిద్యాలయాలు పరిశోధన గ్రంథాలుగా గుర్తించాయి. ఇది ఉత్తరాంధ్ర జిల్లాకు, జానపద కళాకారులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఎంతో మంది అజ్ఞాత, నిరాదరణకు గురవుతున్న కళాకారులను ప్రతి సంక్రాంతికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. ఇది ఒక వ్యక్తిగా చిన్న ప్రయత్నం. జానపద సంపద, కళాకారులను ప్రభుత్వం కూడా రక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. నా వంతు ప్రయత్నంగా జానపద కళల పరిరక్షణకు కృషి చేస్తూనే ఉంటాను.

-బద్రి కూర్మారావు, రచయిత, విశ్రాంత అధ్యాపకుడు

నిజంగా.. ఆదర్శ పాఠశాలే!

- కొండములగాం స్కూలుకు ఉత్తమ గుర్తింపు
- పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత
- 100 మందిలో 82 మందికి 500 మార్కులకుపైగా..
- ఒకేసారి 24 మంది ట్రిపుల్ ఐటీకి..

రణస్థలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో 100 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా.. అందరూ ఉత్తీర్ణత సాధించారు. శతశాతం ఉత్తీర్ణతతో అబ్బురపరిచారు. ఏకంగా 80 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారు. అదే క్రమంలో 24 మంది ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. అలాగని అదేదో కార్పొరేట్ పాఠశాల కాదు. ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రభుత్వ పాఠశాలగా గుర్తింపు పొందింది. అదే రణస్థలం మండలంలోని కొండములగాం ఆదర్శ ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఈ ఏడాది ఆగస్టు 15 వేడుకల్లో సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంది. రాష్ట్ర స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించింది.



ఆదర్శ పాఠశాల ఇదే..

● అత్యుత్తమ మార్కులతో...

రణస్థలం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉంటుంది కొండములగాం. అక్కడ పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు ఉండడంతో ఉత్తమ విద్యా బోధనకు అవకాశం కలుగుతోంది. దీంతో కొండములగాంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారు. మొత్తం 18 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాల నుంచి 100 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. అందరూ ఉత్తీర్ణత సాధించారు. 82 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. కె.శిరీష అనే విద్యార్థిని 591 మార్కులతో మండలంలోనే ప్రథమురాలిగా నిలిచింది.

● 24 మంది ట్రిపుల్ ఐటీకి..

కొండములగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఒకేసారి గత ఏడాది 24 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం విశేషం. ఇందులో కొందరు శ్రీకాకుళం... మరికొందరు ఇడుపాలపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఒక పాఠశాల చరిత్రలో ఒకేసారి ఇంతమంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం విశేషమని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.


ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

● ఉపాధ్యాయుల శ్రద్ధతో...

సువిశాల ప్రాంగణం ఈ పాఠశాల సొంతం. బడి చుట్టూ పచ్చటి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంటశాల, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కూడా ఉంది. విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధతోనే మంచి ఫలితాలు వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఏటా ఇక్కడ అడ్మిషన్లు పెరుగుతుండడం విశేషం. పెరుగుతున్న విద్యార్థులకు తగిన విధంగా వసతితో పాటు సౌకర్యాలు మెరుగుపరచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలికలకు ప్రత్యేక వసతిగృహం..

ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలోనే బాలికలకు ప్రత్యేక వసతి గృహం ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా వసతిగృహం ఏర్పాటు చేశారు. 9వ తరగతి నుంచి ఇంటర్ మీడియట్ చదువుతున్న 80 మంది విద్యార్థులకు వసతి గృహం అందుబాటులో ఉంది. అక్కడ సిబ్బందితో నిత్యం పర్యవేక్షణ ఉంటోంది.


సీఎం చంద్రబాబు నుంచి బహుమతి అందుకుంటున్న ప్రిన్సిపాల్

● సంతోషంగా ఉంది..

రాష్ట్ర స్థాయిలో కొండములగాం పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉపాధ్యాయులంతా సమన్వయంతో వ్యవహరించడం వల్లనే ఇది సాధ్యమైంది. విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం కూడా మరువలేనిది. ట్రిపుల్ ఐటీతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా నిలవడం గర్వంగా ఉంది. అంతకు మించి సంతోషంగా ఉంది.

-శ్రీధర్, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, కొండములగాం



'పోలీసు' అక్షర క్రమంలో కూర్చున్న విద్యార్థులు

అమరవీరులకు వినూత్నంగా నివాళి

ఇచ్ఛాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా స్థానిక జ్ఞానభారతి ఎస్పీసీ(స్కూల్ పోలీసు కేడెట్) వింగ్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వినూత్నంగా నివాళులర్పించారు. ఆంగ్ల భాషలో 'పోలీసు' అనే అక్షరాల ఆకారంలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీఈవో జోహార్‌ఖాన్, ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్స్‌పాల్ ఐటీ పండా, హెచ్ఎం రషీదా సుల్తాన్, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

సిక్కోలులో ఉద్యానవనం

- డచ్ బంగ్లా చుట్టూ పెంచండి
- రూ.100 కోట్లతో అరసవల్లి దేవాలయం అభివృద్ధి
- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు


డచ్ బంగ్లా వద్ద పర్యటిస్తున్న కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

అరసవల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద గల 300 ఏళ్ల నాటి పురాతన డచ్ భవనం చుట్టూ ఆహ్లాదకరమైన ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కేంద్ర పౌర, విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన శనివారం డచ్ బంగ్లా వద్ద పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఢిల్లీ గేటు తరహాలో డచ్ భవనం చుట్టూ ఉద్యానవనాన్ని, పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. నాగావళి నది కనిపించేలా శ్రీకాకుళం నగర ప్రజలు సేద తీరేందుకు ఐకానిక్ ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. రూ.100 కోట్లతో అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవాలయం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. శ్రీకూర్మం సర్క్యూట్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

త్వరలో సిక్కోలు సంబరాలు..

త్వరలో సిక్కోలు సంబరాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. అలాగే ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేద్దామని.. ప్రజల స్పందనను బట్టి ఫెస్టివల్‌ను పొడిగిస్తామని తెలిపారు. జిల్లాలో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. రహదారులు, భవనాల గ్రౌండ్‌లో దీపావళి సంబరాలు నిర్వహించనున్నామని కేంద్ర మంత్రికి కలెక్టర్ వివరించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ పర్యటనలో ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, పర్యాటక అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఓ డాక్టర్‌గారి నకిలీలలు

(ఐదో పేజీ తరువాయి)

సిఫార్సు చేసే బాధ్యత తమదేనని స్పష్టం చేస్తున్నారు. ఇందుకోసం ఏడాదికి అందుకునే పింఛన్ మొత్తాన్ని ఒకేసారి మామూళ్ల రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చక్రం తిప్పుతూనే ఉన్నారు. చాలామంది పింఛన్ కోసం ఆశపడి.. దళారీలు అడిగినంత డబ్బు అందజేస్తున్నారు. అందులో సగభాగం వైద్యుడికి అందించి.. అడ్డూ అదుపు లేకుండా సదరంలో ధ్రువపత్రాలను క్లియరెన్స్ చేయించుకుంటున్నారు.

● పట్టించుకోని ప్రజాప్రతినిధులు..

రాజకీయాల కారణంగా.. తన వర్గానికి దూరమవుతారనే ఉద్దేశంతో ప్రజాప్రతినిధులు నకిలీ వికలాంగులు పింఛన్ పొందడాన్ని చిన్నవిషయంగా తీసుకుంటున్నారు. ఓ ఎమ్మెల్యే మాత్రం.. రాజకీయాలతో సంబంధం లేకుండా అనర్హుల ఏరివేతతోపాటు.. అందుకు సహకరించిన వైద్యాధికారిపై చర్యలు ఉండేలా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఇతర నియోజకవర్గాల్లో సైతం నకిలీ దివ్యాంగులు కుప్పలుగా ఉన్నారు. ఇందులో దళారీలకు వంతపాడుతూ.. వారిచ్చే డబ్బులకు ఆశపడుతూ.. అర్హులకు మాత్రం చుక్కలు చూపిస్తున్న వైద్యుల పనిపట్టేందుకు కొంత మంది ఎమ్మెల్యేలు మౌనంగానే ఉంటున్నారు. గత వైసీపీలో జరిగిన అక్రమాలను ఇప్పటికీ కొనసాగించేందుకు పరోక్షంగా సహకరిస్తున్నారు. అయితే అర్హులు మాత్రం.. అవినీతి వైద్యుడి బాగోతాన్ని.. జిల్లాలో అనర్హుల జాబితాను పింఛన్ ఐడీల నెంబర్‌తో సైతం ముఖ్యమంత్రి పేషీకి... రాష్ట్ర ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపైనే విచారణ జరుగుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి.. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పింఛన్ జాబితాలో అనర్హులను ఏరివేసి.. అర్హులకు న్యాయం చేయాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

(ఐదో పేజీ తరువాయి)

పేలుళ్లు జరగకుండా ప్రశాంతంగా దీపావళి పండగ చేసుకునేలా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. బాణసంచా విక్రయాల సమయంలో వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలి. సామగ్రి భద్రపరిచిన గొడౌన్లు, దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలి. ఇసుక, ఫైర్ ఇంజిన్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి. ఖాళీ ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలి. ఒక్కో దుకాణానికి 5 నుంచి 10 అడుగుల దూరం పాటించాలి. పరిమితికి మించి మందుగుండ సామగ్రి నిల్వ ఉంచరాదు. అనుమతులు లేకపోయినా.. నిబంధనలు పాటించకపోయినా చర్యలు తప్పవు' అని ఎస్పీ హెచ్చరించారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ..

అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. 'ప్రస్తుతం విజ్ఞానవంతులే అధికంగా సైబర్ నేరాల బారిన పడి మోసపోతున్నారు. ఓటీపీ, లింక్ క్లిక్, మాల్వేర్, ఏపీకే ఫైల్ తరహా నేరాలతో పాటు డిజిటల్ అరెస్ట్ వంటి నేరాలు ఎక్కువ జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరు వ్యక్తిగత, గుర్తింపు కార్డు వివరాలు అనధికార వ్యక్తులకు, సంస్థలకు చెప్పరాదు. కొంతమంది సైబర్ నేరగాళ్లు పోలీసుల పేరు చెప్పి.. బెదిరిస్తూ.. మోసాలకు పాల్పడుతున్నారు. అటువంటి వారి ఫోన్‌కాల్స్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతే.. తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయండి' అని ఎస్పీ సూచించారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

జూన్ నాటికి నదుల అనుసంధానం

(ఐదో పేజీ తరువాయి)

ఎస్ఈ వివరించారు. కోర్టు కేసులు, భూసేకరణ వివాదాలు, పెండింగ్ బిల్లులు తదితర అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని కలెక్టర్ సూచించారు. అలాగే గొట్టాబ్యారేజీ ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే ఏడాది నీటిని పంపుల ద్వారా.. హిరమండలం ప్రధాన రిజర్వాయర్‌కి తరలించి 19 టీఎంసీలు నిల్వ ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఉద్దానంలో 700 గ్రామాలకు తాగునీటి పథకం పనులు, నేరడి బ్యారేజీ, వంశధార ట్రిబ్యునల్, స్టేజ్-2 పనులు, రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనుల పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీఓలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ స్వర్ణకుమార్, ఈఈ శేఖర్, హిరమండలం రిజర్వాయర్ డీఈ రమణ పాల్గొన్నారు.

సందడిగా నందన్న నిమజ్జనోత్సవం

నందిగాం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దతామరాపల్లిలో నందన్న నిమజ్జనోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గౌరీ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 17న ప్రతిష్ఠించిన నందన్నకు 10 రోజుల పాటు పూజలు చేశారు. శనివారం పగటి వేషాలతో... మేళతాళాలతో నందన్నను ఊరేగించారు. అనంతరం నిమజ్జనం చేశారు.


పెద్దతామరాపల్లిలో నందన్న ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఎరువుల దుకాణంలో తనిఖీలు

సోంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల షాపుల్లో వ్యవసాయ శాఖాధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టాక్ పరిశీలించి రికార్డుల్లో వివరాలు పరిశీలించారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు రసీదులు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో పలాస ఏడీ ఎల్‌వీ మధు, ఏవో బి.నరసింహమూర్తి ఉన్నారు.

ఉపాధి పనులపై మ్యాప్‌లు

ఎచ్చెర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న ఉపాధి పనులపై మూడు రకాల మ్యాప్‌లు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ముద్దాడ గ్రామంలో సోషల్, సీజనల్, రీసోర్స్ మ్యాప్‌లను శనివారం తయారుచేశారు. ఈ మ్యాప్‌లను వేతనదారులతో వేయించారు. పంచాయతీ కార్యదర్శి సుమలత, టెక్నికల్ అసిస్టెంట్ సీహెచ్ ప్రభాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.అసిరిపోలి యాదవ్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పరిశీలన

గార, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వమరవల్లిలో రక్షిత తాగునీటి సరఫరా పథకాన్ని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్‌ఈ ఈషాబాషా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాగునీరు సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాన్నారు. ఈఈ రంగప్రసాద్, డీఈఈలు లలితకుమారి, శంకర్, ఏఈ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇచ్ఛాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎచ్చెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో డొంకూరు విద్యార్థిని పి.నితిన్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 28 నుంచి 29వ తేదీ వరకు బాపట్ల జిల్లా ఇదిపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం సీహెచ్ వెంకటరమణ తెలిపారు.

పేదరిక నిర్మూలనకు కృషి

కంచిలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వేగవంతం చేస్తూ మహిళలు ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఏపీఎం సనపల ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను శనివారం వారు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పథకాలు, సబ్సిడీ రుణాలు, ఇతర అంశాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు.

ఉపాధి వేతనాలు పెంచుతాం

కంచిలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో వి.తిరుమలరావు తెలిపారు. పెద్ద శ్రీరాంపురం పరిధిలో జరుగుతున్న సరిహద్దు కందకాల నిర్మాణ పనులను ఏపీవో జి.ధనుంజయతో కలసి శనివారం పరిశీలించారు. కొత్త పనులు గుర్తించడం, చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టప్పపేట రోడ్డు పనులను ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ప్రారంభించారు. రూ.50లక్షలతో రోడ్డు నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు.

తాగి అల్లరి చేస్తే జైలే: డీఎస్పీ

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే జైలు శిక్ష తప్పదని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీషీటర్లు, సస్పెక్ట్‌ల వివరాలు సేకరించి స్టేషన్ రికార్డుల్లో ఉన్న వారి ఫొటోలు, వేలి ముద్రలను అప్‌డేట్ చేస్తున్నామన్నారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో మద్యం సేవించి అల్లర్లు సృష్టించిన లోపింటి నిరంజన్ భాస్కరరావును అరెస్టు చేసి జైలుకి పంపించామని తెలిపారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

అరసవల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టారు. వివిధ కారణాలతో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాల్లోని నలుగురికి కండక్టర్లగా కారుణ్య నియామకపత్రాలను జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ శనివారం తన కార్యాలయంలో అందజేశారు.

సమయపాలన పాటించాలి

లావేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమయపాలన పాటించాలని జిల్లా స్త్రీ సంక్షేమ శాఖ పీడీ శాంతిశ్రీ అన్నారు. లావేరు-3, బొంతుపేట, గోవిందపురం అంగన్వాడీ కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. ప్రీ స్కూల్ పిల్లలకు ఆటపాటల ద్వారా బోధించాలని సూచించారు. రణస్థలం సీడీపీవో రూస్సీబాయి పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళికలు తప్పనిసరి

లావేరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలను తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో వాగ్దేవి అన్నారు. శనివారం గురుగుబిల్లి ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. 3, 4 తరగతుల విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆమె తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

కంచిలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):కంచిలి ప్రాథమిక పాఠశాలకు చెందిన నర్తు రామ్‌రస్వీర్, కంబాల మహేష్ రెడ్డి, ఇంటివెనుక కౌశిక్ నవోదయకు ఎంపికయ్యారు. వీరికి శనివారం పాఠశాల పూర్వపు హెచ్‌ఎం షావుకారి సోమేశ్వరరావు రూ.5వేలు చొప్పన ఎంఈవోలు శివరాం ప్రసాద్, చిట్టిబాబు చేతులు మీదుగా అందజేశారు.

కార్యకర్తలే టీడీపీకి బలం

- పార్టీ సభ్యత్వ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం అని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణతో కలసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. 'ఐదేళ్ల వైసీపీ దుర్మార్గపు పాలనలో ఎన్నో కష్ట, నష్టాలకు ఓర్చి పార్టీని అగ్రస్థానంలో నిలబెట్టింది కార్యకర్తలే. పార్టీ సభ్యత్వ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి. సభ్యులుగా నమోదైన వారికి రూ.5లక్షల బీమా సౌకర్యం, ఇతర సహాయ సహకారాలు పార్టీ అందజేస్తుంది. రానున్న ఐదేళ్లలో జిల్లాలో చిరస్థాయిగా నిలిచిపోయే ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపడతాం.' అని రామ్మోహన్ అన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు శీర రమణయ్య, మెండ దాసునాయుడు, కొమ్మనాపల్లి రామరాజు, పాండ్రంకి శంకర్, కవ్వాడి సుశీల, కృష్ణమూర్తి నాయుడు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. ● అరసవల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం డివిజన్ ఇన్‌చార్జి, నగర బీసీ సెల్ అధ్యక్షుడు ఉంగటి రమణమూర్తి ఆధ్వర్యంలో పండుగలా జరిగింది. ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఉంగటి పాపారావు రూ.35వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను పేద విద్యార్థికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.



అరసవల్లి: ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

పండగ వాతావరణంలో సభ్యత్వ నమోదు

- మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు పండగ వాతావరణంలో చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం టెక్కలిలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. తొలి సభ్యత్వాన్ని రూ.100 చెల్లించి ఆయన తీసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, నేతలు పినకాన అజయ్‌కుమార్, కింజరాపు ప్రసాద్, ఎల్ఎల్ నాయు డు, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, లవకుమార్, మామిడి రాము తదితరులు ఉన్నారు.

అనేక ప్రయోజనాలు: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట/జలుమూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వం స్వీకరించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం హడ్కో కాలనీ, జలుమూరు మండలం టెక్కలిపాడు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు పక్రియను ప్రారంభించారు. బగ్గు కుమార్తె అర్చన, టీడీపీ వాణిజ్యమండలి నాయకుడు జామి వెంకటరావు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శిమ్మ చంద్రశేఖర్, నేతలు వెలమల రాజేంద్రనాయుడు, కత్తిరి వెంకటరమణ, వెలమల రాజేంద్రనాయుడు, గురుబెల్లి రూస్సీ, దుంగ స్వామిబాబు, మెండ రాంబాబు, గొద్దు చిట్టిబాబు, బెవర రాము, కింజరాపు రామారావు, బలగ ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే రథసారథులు: ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే రథ సారథులని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, నేతలు అక్కంద్ర, సన్యాసి, కలమట భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: వజ్జ

పలాస, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్య దర్శి, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. శనివారం పార్టీ కార్యాల యంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టారు. నేతలు లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, వజ్జ గంగాభవాని, ఎం.నరేంద్ర (చిన్ని), గురిటి సూర్యనారా యణ, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, డొక్కర శంకర్, యవ్వారి మోహనరావు, దడియాల నర్సింహులు మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



నరసన్నపేట/జలుమూరు: సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



కవిటి: పార్టీ సభ్యత్వాన్ని తీసుకుంటున్న ఎమ్మెల్యే అశోక్

తెలుగు జాతి ప్రగతి కోసమే టీడీపీ

- విజయనగరం ఎంపీ కలిశెట్టి

రణస్థలం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ప్రగతి కోసమే టీడీపీ అని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రణస్థలంలో శనివారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం అందిస్తుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు లంక శ్యామలరావు, మాజీ జడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావు, పిసిని జగన్నాథంనాయుడు, డీజీఎం ఆనందరావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా చేపట్టండి: ఎమ్మెల్యే అశోక్

కవిటి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాన్ని గ్రామ స్థాయిలో చురుగ్గా చేపట్టాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ కార్యకర్త పార్టీ సభ్యత్వాన్ని తీసుకొని ఇన్సూరెన్స్‌కు అర్హత పొందాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వాన్ని ఎమ్మె ల్యే అశోక్ స్వీకరించారు. కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి మండలాల నాయకులు పాల్గొన్నారు.



పాతపట్నం: సభ్యత్వ నమోదును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పలాస: టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు



రణస్థలం: మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఎలక్ట్రానిక్ స్కూటర్ షోరూం ప్రారంభం

అరసవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దపాడు రోడ్డులో ఎలక్ట్రానిక్ స్కూటర్ షోరూంను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం శాసన సభ్యుడు గొండు శంకర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూంయజమాని పైడి హరికృష్ణ మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారికి అనుకూలంగా, క్వాలిటీ గల స్కూటర్లు ఫైనాన్స్ సదుపాయంతో, అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, బంధు మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న దృశ్యం

విద్యార్థులు బాధ్యతగా నడుచుకోవాలి: ఎస్పీ

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి యూనిఫాం లేని పోలీసేనని, సమాజంపై బాధ్యతగా నడుచుకోవాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. పోలీసు అమర వీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా శనివారం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వచ్చారు. పోలీసు ఆయుధాలు, పరికరాలు, విధి విధానాలపై విద్యార్థులకు ఎస్పీ అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, ర్యాగింగ్‌కు పాల్పడవద్దని విద్యార్థులకు సూచిం చారు. అమర వీరుల స్మారకోత్సవంలో భాగం గా ఈ నెల 28న జిల్లా పోలీసు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, శేషాద్రి, సీఐలు ఉమామహేశ్వరరావు, ఇమ్మానియల్ రాజు, సూర్యాయావు, సత్యనారాయణ, ఎస్ఐ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నీట్‌లో డీఆర్ వలస విద్యార్థిని ప్రతిభ

జి.సిగడాం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): డీఆర్ వలస గ్రామానికి చెందిన బెవర సంధ్యారాణి నీట్‌లో 593 మార్కులతో 2,568వ ర్యాంక్ సాధించింది. ఈ క్రమంలో శనివారం విడుదలైన మూడో విడత జాబితాలో ఎంబీబీఎస్ సీట్ సాధించింది. ఈమె పదో తరగతి వరకు రాజాంలో, ఇంటర్ బైపీసీ విశాఖలో పూర్తి చేయగా, విజయవాడలో నీట్ లాంగ్ టెర్మ్ కోసింగ్ తీసుకొని రెండో ప్రయత్నంలో విజయం సాధించింది. ఈమె తండ్రి కాంతారావు లారీ డ్రైవర్, తల్లి సత్యవతి గృహిణి. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె సంధ్యారాణి కాగా చిన్న కుమార్తె భార్గవి బీఎస్సీ చదువుతుంది. నీట్‌లో ప్రతిభ కనపరిచిన సంధ్యారాణిని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్), టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, గ్రామస్థులు అభినందించారు.



సంధ్యారాణి

విద్యార్థుల సదుపాయాలపై ఆరా

నందిగాం/మెళియాపుట్టి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నందిగాం కేజీబీవీ, సవరలింగుపురం, మెళియాపుట్టి మండలం కస్తూర్బా, చాపర ఎస్సీ బాలురు , పెద్దలక్ష్మీ పురం, పెద్దమడి, భరణికోట గిరిజన ఆశ్రమ పాఠశాలలను టెక్కలి సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. తరగతి గదులు, వంట గదులు, కూరగాయలు, పాలప్యాకెట్ల నాణ్యత, పరిసరాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలను చేశారు. మెనూ సక్రమంగా అమలవుతున్నదీ లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆయనతో పాటు పాఠశాలల సిబ్బంది ఉన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో వాసుదేవానందగిరి స్వామీజీ

అరసవల్లి/గార, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ (విజయవాడ, పెద్దపులిపాక) శనివారం దర్శించుకున్నారు. ఆయనకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఈవో వై.భద్రాజీ అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కనకరాజు, అర్చకులు పాల్గొన్నారు. ● శ్రీకూర్మంలోని కూర్మనాథుని కూడా వాసుదేవానందగిరి స్వామీజీ దర్శించుకున్నారు.

చెస్ పోటీలకు తాడివలస విద్యార్థినులు

పొందూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్టు హెచ్‌ఎం బి.కంఠయ్య తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో బాపట్లలో జరగనున్న అండర్-17 విభాగం పోటీల్లో పి.రక్షిత, బి.ప్రియదర్శిని, పెద్దపూడి దేవి, ఈనెల 29, 30 తేదీల్లో సత్యసాయి జిల్లా లేపాక్షిలో జరుగనున్న అండర్-14 విభాగం పోటీలకు అంపోలు బిందుమాధవి ఎంపికైనట్టు తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



ఎంపికైన విద్యార్థినులు

మత్స్య, పశు సంవర్థక రంగాల

సంప్రదింపుల కమిటీ సభ్యునిగా కలిశెట్టి

రణస్థలం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర మత్స్య, పశుసంవర్థక రంగాల సంప్రదింపులు, సలహాల కమిటీ సభ్యునిగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా మత్స్య, పశు సంవర్థక రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ఈ కమిటీ సూచనలు, సలహాలు ఇస్తుంది. ఆక్వా రంగంలో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో ఉందని, దీన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

మండల సమావేశం రసాభాస

- టీడీపీ, వైసీపీ సభ్యుల వాగ్వాదం
- కార్యాలయం బయట బైఠాయించిన తమ్మినేని వాణి

ఆమదాలవలస, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో టీడీపీ, వైసీపీ నాయకులు వాగ్వాదంతో రసాభసాగా మారింది. ఎంపీపీ తమ్మినేని శారద అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో రోణంకి వెంకటరావు తొలుత వ్యవసాయశాఖపై సమీక్ష చేపట్టారు. ఏవో మెట్ట మోహన్‌రావు ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు వివిధ అంశాలపై మాట్లాడుతుండగా తొగరాం సర్పంచ్ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సతీమణి తమ్మినేని వాణిశ్రీ కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించలేదన్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వర్తకులను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. దీనిపై టీడీపీ సభ్యులు నూక రాజు, సనపల డిల్లీశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, అన్నెపు భాస్కరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సభ్యులు కాని వారు సమావేశంలో ఎలా ఉంటారని సర్పంచ్ వాణిశ్రీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎంపీడీవోను ప్రశ్నించారు. ఫ్యాన్ గుర్తుపై గెలిచారా? సైకిల్‌గుర్తుపై గెలిచిరా? అంటూ ఎంపీపీ తమ్మినేని శారదను ఆమె ప్రశ్నిస్తూ.. సభ్యులు కానివారిని సమావేశం నుంచి పంపించేయాలని ఆవేశంగా మాట్లాడారు. ఈ విషయంపై మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితులు, వైసీపీ నాయకుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ప్రత్యేకాహ్వానితులుగా అందరినీ సమావేశాలకు ఆహ్వానించడం జరిగిందని, ఇప్పుడు దానిని కాదంటూ వారించడం మంచి పద్ధతి కాదని హితవు పలకడంతో టీడీపీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ సర్పంచ్ వాణిశ్రీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైసీపీ సభ్యులతో సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం ఎంపీపీ సమావేశాన్ని కొనసాగించి శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. ● వైసీపీ సభ్యులతో కలసి తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బైఠాయించారు.



టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం

నకిలీ దివ్యాంగుడికి.. వందశాతం వైకల్యమా?

- రిమ్స్ వైద్యాధికారి తీరుపై ఫిర్యాదు చేస్తాం
- ఆమదాలవలస మండల సమావేశంలో సర్పంచ్ ఆవేదన

ఆమదాలవలస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆసుపత్రిలో కొంతమంది వైద్యాధికారుల తీరు దారుణంగా ఉందని కనుగులవలస సర్పంచ్, టీడీపీ నాయకుడు నూకరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశంలో వైద్య శాఖపై సమీక్ష జరుగుతుండగా సర్పంచ్ నూకరాజు కలుగజేసుకుని మాట్లాడారు. "మా గ్రామంలో ఎటువంటి అంగవైకల్యం లేని ఓ వ్యక్తి.. ఒక కన్ను కనిపించదని నకిలీ సదరం సర్టిఫికెట్‌తో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ పొందాడు. ఆయనకు ఇద్దరు భార్యలు ఉండగా.. వారు వితంతు పింఛన్లు పొందుతున్నారు. దీనిపై అన్ని ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. కలెక్టర్ ఆదేశంతో నకిలీ వికలాంగుడ్ని రిమ్స్‌లో సదరం విభాగానికి పునఃవిచారణ కోసం ఎంపీడీవో పంపారు. అక్కడ లంచాలకు రుచిమరిగిన ఓ వైద్యాధికారి ఏకంగా ఆ నకిలీ వికలాంగుడికి నూరు శాతం దివ్యాంగుడిగా నిర్ధారించి ధృవపత్రాన్ని మంజూరుచేశారు. ఆ వైద్యాధికారిపై ఏపీ వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా.' అని తెలిపారు. ఈనెల నుంచి ఆ వ్యక్తి పింఛన్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు. ఇలాంటి వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని సభ్యులందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

గంజాయి నిందితుడిని తరలిస్తున్న వాహనం బోల్తా

- స్వల్ప గాయాలతో బయటపడిన నిందితుడు, ఇద్దరు పోలీసులు

సోంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో గంజాయితో పట్టుబడిన నిందితుడ్ని ఓ ప్రైవేట్ వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా సోంపేట మండలం పాలవలస వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి బోల్తాపడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిందితుడు రిహాన్ ఆలీని కోర్టులో ప్రవేశపెట్టేందుకు శ్రీకాకుళం వెళ్తుండగా కారు టైరు పేలడంతో పల్టీలు కొట్టింది. అయితే ఇదే సమయంలో ఎటువంటి వాహనా లు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిందితుడితోపాటు ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని వేరొక వాహనంలో శ్రీకాకుళం తరలించారు.

'ఇది ప్రజా ప్రభుత్వం'

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, ప్రజల సమస్యలను పరిష్కరించే ప్రజా ప్రభుత్వమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. 29 డివిజన్లకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై కేంద్ర మంత్రికి వినతులు అందజేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


గణపతి (ఫైల్)

గార, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశం పంచాయతీ వాడపాలెంకు చెందిన పాకాల గణపతి (41) అనే మత్స్యకారుడు వంశధార నదిలో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపతి శుక్రవారం ఉదయం విసురు వలతో వంశధార నదిలో చేపల వేటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్లా వెతికారు. జాడలేకపోవడంతో గార పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆయన మృతదేహం కళింగపట్నం దగ్గరలోని వంశధార నది ఒడ్డున కుటుంబ సభ్యులు గుర్తించారు. వేటకు వెళ్లిన గణపతి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడిపోయి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఆయనకు భార్య పార్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ టి.చంద్రమోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..


లోకనాథం(ఫైల్)

ఆమదాలవలస, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం దరి కొత్తరోడ్డు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేష్, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం రూరల్ మండలం నందగిరిపేటకు చెందిన సువ్వారి లోకనాథం (35) శ్రీకాకుళంలోని బీసీ బాయ్స్ హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం విధులు ముగించుకొని తిరిగి ఇంటికి ఒక ప్రైవేట్ కళాశాల బస్సులో వస్తుండగా కొత్తరోడ్డు సమీపంలో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీంతో కిందికి దిగిన లోకనాథం.. అదే బస్సు ముందు నిల్చొని ఉన్నాడు. దీన్ని గమనించని డ్రైవరు బస్సును ముందుకు కదిలించాడు. దీంతో లోకనాథం పైనుంచి ఆ బస్సు చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. లోకనాథానికి భార్య సునీత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఆమదాల వలస ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరు..

లావేరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం గ్రామానికి చెందిన బోర శంకర్ (36) శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 23న తన ఇంట్లో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. దీంతో శంకర్‌ను చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. శంకర్ భార్య అసిరితల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రామారావు కేసు నమోదు చేశారు.

10 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయిడు

ఇచ్ఛాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రిహాన్ అలీ నుంచి 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ చిన్నంనాయుడుతో కలిసి విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఎస్‌ఐ చిన్నం నాయుడికి వచ్చిన సమాచారం మేరకు.. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఉదయం 11.30గంటల సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రిహాన్ అలీని తనిఖీ చేయగా.. అతడి వద్ద 10.150 కిలోల గంజాయి గుర్తించారు. అతడిని విచారించగా.. రిహాన్ అలీ కేరళలో గృహనిర్మాణ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఒడిసా రాష్ట్రం షెరాగొడో ప్రాంతానికి చెందిన రాహుల అనే వ్యక్తితో పరిచయం పెంచుకున్నాడు. రాహుల్ ద్వారా అలీ ఒడిశాలో రూ.4వేలకు కిలో గంజాయి కొనుగోలు చేసి.. కేరళలో రూ.10వేలకు అమ్ముతుంటాడు. శనివారం ఉదయం బరంపురంలో దిగి గంజాయి కొనుగోలు చేసి ఇచ్ఛాపురం వరకు బస్సులో చేరుకున్నాడు. ఇచ్ఛాపురం నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ లో బెంగుళూరు వెళ్లి అక్కడి నుంచి బస్సులో కేరళ వెళ్లేందుకు వచ్చినట్టు తెలిపారు. నిందితుడి నుంచి గంజాయితోపాటు ఒక బ్యాగు, సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకుని అలీని అరెస్టు చేసినట్టు తెలిపారు.

డ్యాన్స్ ఈవెంట్‌కు రాలేదని తీవ్రంగా కొట్టారు


- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాలిక, ఆమె తల్లి

పలాస, అక్టోబరు 26: డ్యాన్స్ ఈవెంట్‌కు రాలేదని అడ్డగించి పలాస మండలం బొడ్డపాడు పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా కొట్టారని, సెల్‌ఫోన్లు విరగొట్టారని ఓ బాలిక, ఆమె తల్లి శనివారం కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సోంపేట మండలానికి చెందిన ఓ బాలిక డ్యాన్స్ బాగా చేస్తుండడంతో జెస్సీ ఈవెంట్‌కు చెందిన కె.ఢిల్లీరావు వారి బృందంలోకి తీసుకున్నారు. అయితే చదువులకు ఆటంకం ఏర్పడుతోందని తప్పుకుంది. అయితే శుక్రవారం రాత్రి వజ్రపుకొత్తూరు మండలం రాజాం గ్రామంలో జరిగిన నందెన్న ఉత్సవాల్లో పాల్గొని తిరిగి ద్విచక్రవాహనంపై మరో వ్యక్తితో కలిసి వస్తుండగా ఢిల్లీరావుతో పాటు బి.ప్రణయ్, బి.వినయ్, చరణ్‌లు దారి కాచి తమపై దాడికి పాల్పడ్డారని బాధితులు పేర్కొన్నారు. ఆత్మరక్షణకు 100కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి జరిగిన విషయమై ఫిర్యాదు రూపంలో ఇవ్వాలని కోరారన్నారు. ఆ మేరకు తాము జరిగిన వ్యవహారాన్ని ఫిర్యాదులో పేర్కొన్నామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా టీడీపీకి చెందిన వ్యక్తులపై ఆరోపణలు రావడంతో వైసీపీ నాయకులు ఇదే అదనుగా సోషల్ మీడియాలో ఈ వ్యవహారాన్ని హల్‌చల్ చేయడంతో స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీరావు మీడియాతో మాట్లాడుతూ.. ఆడపిల్లలపై అన్యాయం జరిగితే ప్రశ్నించే గొంతుక మొదటిది తనదేనని, ఇదంతా మాజీ మంత్రి అప్పల రాజు, ఆయన అనుచరులు ఆడుతున్న డ్రామాలన్నారు. రానున్న ఎన్నికల్లో తనను అణగదొక్కేందుకు ఇదొక ప్రయోగమని, వాస్తవానికి తాను నిర్వహిస్తున్న కార్యక్రమాలకు రావద్దని చెప్పానన్నారు. వారిపై దాడి చేశాననడంలో నిజం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై కాశీబుగ్గ పోలీసులు బాధిత మహిళ నుంచి ఫిర్యాదు తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఇచ్ఛాపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన కీర్తి అనే వివాహిత అదృశ్యమైనట్టు ఆమె భర్త నీలాపు హరిప్రసాద్ ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన నీలపు హరిప్రసాద్ కోల్‌కతాలో ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 2017లో హరిప్రసాద్‌కు కీర్తితో వివాహమైంది. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. భార్య, పిల్లలు అతడి తల్లిదండ్రులతో కలిసి ఇచ్ఛాపురంలో ఉంటున్నారు. ఈనెల 19న అతడి భార్య స్కూల్‌కు వెళ్తున్నట్టు ఫోన్ చేసి చెప్పిందని, ఆ తర్వాత ఫోన్ స్విచ్‌ఆఫ్ అయిందన్నారు. దీంతో హరిప్రసాద్ కోల్‌కతా నుంచి వచ్చి ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన



వజ్రపుకొత్తూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదును చేపట్టారు. అధిక సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు పుచ్చ ఈశ్వరరావు, కణితి సురేష్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు అర్సవెళ్లి ఉమామహేశ్వరరావు, కర్ని రమణ, కదంబాల వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి తూట్లు!

- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- అసంపూర్తిగా స్త్రీనిధి భవనం
- అధికారుల్లో చిత్తశుద్ధి లోపమా?

పాతపట్నం/ఎల్‌ఎన్‌పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్రాలను చూస్తున్నారుగా.. ఇవి ప్రజాధనంతో నిర్మించినవేనండీ.. ఒకటి నిర్మాణం పూర్తయి నిరుపయోగంగా ఉంటే.. మరొకటి నిర్మాణం ప్రారంభించి అర్ధంతరంగా వదిలేశారు.. దీంతో లక్ష్యానికి తూట్లు పడుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇవీ పాతపట్నం, ఎల్‌ఎన్‌పేటల్లోని దుస్థితి.. పాతపట్నం మండలం సీతారాంపల్లిలో స్వచ్ఛభారత్‌లో భాగంగా 2016లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. అయితే వాటికి ఆ తరువాత రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించకపోవడంతో 23 మరుగుదొడ్లు నిరుపయోగంగా తయారై శిథిలావస్థకు చేరుకున్నాయి. అలాగే ఎల్‌ఎన్‌పేట మండల కేంద్రంలోని స్త్రీనిధి భవనం రెండంస్థులతో నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. దీంతో దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. సుమారు రూ.25 లక్షల ఉపాధి నిధులతో చేపట్టిన పనులను కాంట్రాక్టర్ అర్ధం తరంగా వదిలేశారు. ఈ రెండు చిత్రాల్లోనూ అధికారుల్లో చిత్తశుద్ధి లోపమే కనిపిస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిని వినియోగం లోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


సీతారాంపల్లిలో వినియోగించకుండానే శిథిలావస్థకు చేరుకున్న సామూహిక మరుగుదొడ్లు


ఎల్‌ఎన్‌పేటలో అర్ధంతరంగా నిలిచిన భవనం

ఇంటర్వ్యూ

రూ.249 కోట్ల స్త్రీనిధి రుణం

- పి.మనోరత్నం, ఏపీఎం, వెలుగు



నందిగాం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో స్త్రీనిధి కింద రూ.2.49 కోట్ల రుణం అందించామని వెలుగు ఏపీఎం పి.మనోరత్నం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రశ్న: మండలంలో స్త్రీనిధి కింద ఎంతమందికి రుణ సదుపాయం లక్ష్యం?

జవాబు: మండలంలో 820 మంది సభ్యులకు రూ.4.10 కోట్లు పంపిణీ లక్ష్యం.

ప్ర: బ్యాంకు లింకేజీ కింద ఎన్ని సంఘాలకు ఎంత రుణం అందించనున్నారు?

జ: 92 సంఘాలకు రూ.5.36 కోట్లు పంపిణీ లక్ష్యం కాగా ఇప్పటివరకు 41 సంఘాలకు రూ.3.05 లక్షలు పంపిణీ జరిగింది.

ప్ర: ఉన్నతి పథకం కింద ఎంతమేర రుణం అందించారు?

జ: మండలంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి అమలవుతున్న ఈ పథకం కింద రూ.8 లక్షలు లక్ష్యం కాగా రూ.3 లక్షలు వడ్డీ లేని రుణం అందించాం.

ప్ర: ఉల్లాస్ పథకానికి ఎంతమందిని గుర్తించారు?

జ: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడం 'ఉల్లాస్' పథకం ముఖ్య ఉద్దేశం. మండలంలో 1,236 మంది నిరక్షరాస్యులుగా గుర్తించాం. వీరిలో పది మంది చొప్పున ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి వారికి ఒక వలంటీర్ ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేశాం.

మద్యం సీసాలు పట్టివేత

లావేరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం వద్ద అదే గ్రామానికి చెందిన గుడ్ల నగేష్ (నరేష్) అక్రమంగా తరలిస్తున్న రూ.7,200 విలువ గల 48 మద్యం సీసాలను శనివారం రాత్రి లావేరు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు పట్టుకున్నారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం

లావేరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): లింగాలవలస సమీపంలోని ఓ మామిడి తోటలో ఎటువంటి అనుమతులు లేకుండా తయారు చేస్తున్న మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గెడ్డాల రమణ (లింగాలవలస), విజయనగరం జిల్లా పెదమానాపురం మండలం ఇంగులపల్లికి చెందిన దాసరి గౌరినాయుడు తయారు చేసిన సుమారు రూ.14,320 విలువైన మందుగుండు సామగ్రిని శుక్రవారం అర్ధరాత్రి దాడి చేసి పట్టుకున్నారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని ఎస్‌ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాన్ ఆలయంలోని హుండీ చోరీ

లావేరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రావివలస వద్దగల జాతీయ రహదారి పక్కనే ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. ఆలయ గెడలు విరగొట్టి హుండీలోని నగదు చోరీ చేశారు. ఈ ఘటనపై ఆ గ్రామస్థులు లావేరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

ఆమదాలవలస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవలస వద్ద శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్మినేని రేవతి అనే హోం గార్డు తీవ్రంగా గాయపడింది. మునిసిపాలిటీలోని జగ్గుశాస్త్రులపేటకు చెందిన రేవతి సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుంది. శనివారం వేకువ జామున విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై ఇంటి కి వస్తుండగా జొన్నవలస వద్ద కుక్క అడ్డు రావడంతో వాహనానికి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో రేవతి తీవ్రంగా గాయ పడింది. ఆమెను స్థానికులు 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. భర్త శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో సురేష్ అరెస్ట్

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం రాగోలు జంక్షన్ వద్ద ఈ నెల 16న కారుతో ఇద్దరు వ్యక్తులను గుద్దేసి పరారైన కేసులో సనపల సురేష్‌ను శనివారం పెద్దపాడు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ కె.రాము తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 16న తమ్మినేని అశోక్, వెంకట సింహాచలం అనే ఇద్దరు వ్యక్తులను సనపల సురేష్ తన కారుతో గుద్ది హత్య చేయబోయాడని రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసుల రిపోర్టుతోపాటు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సురేష్‌కు స్టేషన్ బెయిల్ మంజూరుచేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పటిష్ఠతకు కృషి

హరిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణ అన్నారు. కుంటికోటలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొర్ల హేమారావు చౌదరి తల్లి ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం పార్టీలో నెలకొన్న సంక్షోభాన్ని తొలగించి పార్టీని పటిష్ఠం చేసే దిశలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళా రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. దీనికి గ్రామస్థాయిలో ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ తంగుడు వీర్రాజు, కాంగ్రెస్ నాయకులు దువ్వాడ జీవితేశ్వరరావు, మధుసూదనరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు విస్తృతం చేస్తాం: మంత్రి


ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ఆర్టీసీ సేవలను మరింత విస్తృత పరుస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం టెక్కలి, శ్రీకాకుళం డిపోలకు చెందిన ఏడు ఆర్టీసీ కొత్త సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. టెక్కలి-అమలాపురం ఎక్స్‌ప్రెస్, ఇచ్ఛాపురం- విశాఖకు రెండు సర్వీసులు, శ్రీకాకుళం డిపో నుంచి శ్రీకాకుళం-విజయవాడ, శ్రీకాకుళం-విజయనగరం ఎక్స్‌ప్రెస్, శ్రీకాకుళం-బత్తిలి, శ్రీకాకుళం-విశాఖ సర్వీసులను ప్రారంభించారు. జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్, డీఎం శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, కింజరాపు ప్రసాద్, శేషగిరి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

జలుమూరు, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి) రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. టెక్కలిపాడులోని ఎత్తిపోతల పథకాన్ని శనివారం పునః ప్రారంభించారు. 1250 ఎకరాలకు సాగు నీరందించే ఎత్తిపోతల పథకం వినియోగంలోకి తీసుకు వచ్చామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు బైరి భాస్కరరావు, బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు, కింజరాపు సత్యం, వెలమల చంద్రభూషణరావు, గుండ మన్మథరావు, పిరియా వెంకటరావు, బత్తుల రాజు, గురుబెల్లి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఆసుపత్రి పాత భవనాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పాత ఆసుపత్రి భవనాలను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని వంద పడకల సామాజిక ఆసు పత్రి పాత భవనాలను శనివారం ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి తదితరులు పరిశీలించారు. బుధవారం 'ఇటు నిరుపయోగం.. అటు అద్దె భారం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. భవనాలను పరిశీలించి తగుచర్యలు తీసుకో వాలని ఆర్డీవోను ఆదేశించారు. ఈనేపథ్యంలో ఆర్డీవో ఎక్సైజ్, ఫైర్స్, ఎంవీఐ, కార్మికశాఖ, ట్రెజరీ, వ్యవసాయశాఖ, డీఎల్‌డీవో తదితర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఓపీ విభాగాన్ని పరిశీలించి ఏయే శాఖలకు భవనాలు అవసరమో గుర్తించారు. పరిసరాలను పరిశుభ్రం చేయాలని ఈవో జగన్నాథరావుకు ఆదేశించారు. ఈ భవనాలను వినియోగంలోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకుందామని ఆయన అన్నారు. కార్యక్రమంలో డీఎల్డీవో అలివేలు మంగమ్మ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

టెక్కలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రమైన రావివలస ఎండలమల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక సోమవారాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. ఈ మేరకు శనివారం దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఈవో గురునాథరావు భక్తులకు కల్పించే దర్శనాలు, క్యూలైన్లు, ఇతర మౌలిక సదుపాయాలు వివరించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆర్డీవో సూచించారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని, పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, పంచాయతీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఫోన్లు చోరీకి గురైతే 'సీఈఐఆర్'లో ఫిర్యాదు చేయండి: ఎస్పీ

- 154 మొబైల్స్ రికవరీ
- బాధితులకు అప్పగింత


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళంక్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎవరి మొబైల్ ఫోన్లు చోరీకి గురైనా, పోగోట్టుకున్నా తక్షణమే సీఈఐఆర్.జీవోవీ.ఇన్ పబ్లిక్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. గత రెండు నెలల్లో చోరీకి గురైన 154 ఫోన్లను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాధితుల ఫిర్యాదు మేరకు గడిచిన రెండు నెలల్లో 154 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని, వాటి విలువ రూ.24 లక్షలు అని తెలిపారు. ఈ ఏడాదిలో జిల్లాలో మొత్తం రూ.79 లక్షల విలువైన 618 ఫోన్లు రికవరీ చేశామ న్నారు. జూన్, జూలైకి సంబంధించి ఆగస్టు 9న రూ.15 లక్షల విలువైన 100 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించినట్టు చెప్పారు. సైబర్ సెల్ సీఐ టి.శ్రీను, సిబ్బంది చక్రి, రమేష్, సుధీర్, సత్యనారాయణ గిరిలను అభినందిం చారు. కాగా, ఫోన్లు తిరిగి దొరకడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో ఎస్బీ సీఐ ఇమ్మానియల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోండి


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

పాతపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచా జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యసాధన, క్రమశిక్షణతో విద్యను పొందాలని కోరారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రాంగణంలో లైట్లు ఏర్పాటు చేయాలని, ప్రహరీ నిర్మించాలని కళాశాల ప్రతినిధులు కోరారు. ప్రిన్సిపాల్ కణితి శ్రీరాములు, వైస్‌ప్రిన్సిపాల్ చక్రవతి పాల్గొన్నారు.

రబీలో వాణిజ్య పంటలు సాగు చేయాలి

నరసన్నపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రానున్న రబీ సీజన్‌లో రైతులు వాణిజ్యపంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ జేడీ త్రినాథస్వామి అన్నారు. శనివారం సత్యవరం గ్రామంలో సుడిదోమ సోకిన వరి పైరును పరిశీలించారు. నీటి సౌకర్యం ఉన్న పొలాల్లో కూడా ఆరుతడి పంటలైన వేరుశనగ, పెసర, మినప, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలను పండించడం ద్వారా ప్రయోజనం ఉంటుందన్నారు వరి పంటకు అవసరమైననీటి సదుపాయం రిజర్వాయర్‌లో లేదన్నారు. సుడిదోమ సోకకుండా కాలిబాటలు తీయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాస్త్రవేత్తలు ముకుందరావు, ఉదయ్‌బాబు, ఏపీ సీడ్స్ డీఎం బాలకృష్ణ, ఏడీఏ రవీంద్రభారతి, ఏవో సునీత తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

భక్తిమార్గంతో ప్రశాంతత

కోటబొమ్మాళి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు భక్తిభావం కలిగి ఉండడం ద్వారా ప్రశాంత వాతావరణం పొందచ్చని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్ అన్నారు. శనివారం చిట్టీవలసలో సత్యసాయిబాబా మందిర ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవకులు, నేతలు పాల్గొన్నారు.

కార్యకర్తలపై దాడులను అరికట్టాలి

మందస,అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టాలని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం పార్టీ కార్యకర్తలతో ఇటీవల జరిగిన పరిణామాలపై చర్చించారు. టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో ఫొటోలు పెట్టారంటూ కార్యకర్తలను వేధించడం సరికాదన్నారు. కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు పోరాటం తప్పదన్నారు. హరిపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కార్యకర్తను పరామర్శించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు బొడ్డపాడు విద్యార్థి ఎంపిక

పలాసరూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్టుకు అండర్-17 విభాగంలో బొడ్డపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థి రాపాక ప్రణీత్ ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ నెల 27 నుంచి 29 వరకు అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సంతబొమ్మాళి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నౌపడ ఎస్‌ఐ కె.నారాయణస్వామి అన్నారు. శనివారం నౌపడ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఇదే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీమేశ్వ రరావు, ఏఎస్‌ఐ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

టెక్కలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ అయ్యప్పనగర్ లోని ఆక్రమణలను శనివారం అధికారులు తొలగించారు. పాత జాతీయరహదారి నుంచి కొత్త హైవేకి అయ్యప్ప నగర్ మీదుగా 40 అడుగుల రోడ్డు పనులు చేపట్టనున్న నేపథ్యంలో తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి నేతృత్వంలో మార్కింగ్ వేశారు. పీఆర్ ఈఈ సూర్యప్రకాష్, మండల ఇంజనీరింగ్ అధికారి లక్ష్మ నాయుడు పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

హిరమండలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మాన్ పథకం కింద చేపడుతున్న మల్టీపర్పస్ సెంటర్ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. చల్ల రాయిగూడ, మూర్తిమానుగూడ, పుద్దోడిగూడ గ్రామాల్లో నిర్మిస్తున్న భవనాలను శనివారం పరిశీలించారు. నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలని సూచించారు.

అనంతలో ఘోర రోడ్డు ప్రమాదం

- టైరు పేలి లారీని ఢీకొట్టిన కారు
- ఆరుగురు ఇస్కాన్ భక్తుల మృతి
- ఒకరు మందస వాసి

శింగనమల/హరిపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా శింగన మల మండలం నాయనిపల్లి క్రాస్ వద్ద శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. టైరు పేలడంతో అదుపు తప్పిన కారు.. ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఆరుగురు ఇస్కాన్ భక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. తాడిపత్రి పట్టణంలోని ఓ భక్తుడి గృహ ప్రవేశం సందర్భంగా శ్రీకృష్ణుడి సంకీర్తనలు పాడేందుకు అనంతపురం నుంచి వీరు శనివారం ఉదయం కారులో వెళ్లారు. కార్యక్రమం ముగిసిన అనంతరం భక్త బృందం అదే కారులో తిరుగుపయనమైంది. శింగనమల మండల పరిధిలోని నాయనిపల్లి క్రాస్ వద్దకు రాగానే కారు టైరు ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. ఆ వేగానికి కారు ముందుభాగం లారీ కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జు అయ్యింది. కారులో ప్రయాణిస్తున్న బాలుగొండ శ్రీనివాసులు అలియాస్ శ్రీధర్ (34), సంతోష్ (34), బొట్టా షణ్ముగ్ (21), జిల్లే వెంకటేష్(వెంకీ) (20), కర్ణ ప్రణీత్ ప్రణవ్ సాయి రెడ్డి (14), యాగంటి లక్ష్మీ ప్రసన్న కుమార్ రెడ్డి (29) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో బొట్టా షణ్ముగ్‌ది మందస మండలం బహాడపల్లి. సాంబమూర్తి, సుజాత దంపతుల కుమారుడైన షణ్ముగ్ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూనే.. కియా కార్ల తయారీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అనంతపురం సాయి నగర్‌లో ఉంటున్నాడు. మూడేళ్లుగా ఇస్కాన్ సభ్యుడిగా ఉంటూ సంకీర్తనల్లో పాల్గొంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. తండ్రి, సోదరుడు బెంగళూరులో ఉండగా.. అండమాన్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు తల్లి వెళ్లింది. షణ్ముగ్ మృతితో బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.


ప్రమాద దృశ్యం (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన షణ్ముగ్ (ఫైల్)